# 2 సమూయేలు 14వ అధ్యాయము

1 రాజు అబ్షాలోము మీద ప్రాణము పెట్టుకొనియున్నాడని సెరూయా కుమారుడైన యోవాబు గ్రహించి2
తెకోవనుండి యుక్తిగల యొక స్త్రీని పిలువనంపించి - ఏడ్చుచున్న దానవైనట్టు నటించి
దుఃఖవస్త్రములు ధరించుకొని తైలము పూసికొనక బహుకాలము దుఃఖపడిన దానివలెనుండి 3 నీవు రాజునొద్దకు
వచ్చి యీ ప్రకారము మనవి చేయవలెనని దానికి బోధించెను. 4 కాగా తెకోవ ఊరి స్త్రీ రాజునొద్దకు వచ్చి
సాగిలపడి నమస్కారముచేసి - రాజా రక్షించు మనగా 5 రాజు- నీకేమి 5 కష్టము వచ్చెనని అడిగెను. అందుకు
ఆమె - నేను నిజముగా విధవరాలను, నా పెనిమిటి చనిపోయెను; 6 నీ దాసినైన నాకు ఇద్దరు కుమారులు
ఉండిరి, వారు పొలములో పెనుగులాడుచుండగా విడిపించు వాడెవడును లేకపోయినందున వారిలో నొకడు
రెండవవాని కొట్టి చంపెను. 7 కాబట్టి నా యింటివారందరును నీ దాసినైన నా మీదికి లేచి - తన సహోదరుని
చంపినవాని అప్పగించుము; తన సహోదరుని ప్రాణము తీసినందుకై మేము వానిని చంపి హక్కుదారుని నాశనము
చేతుమనుచున్నారు. ఈలాగున వారు నా పెనిమిటికి భూమిమీద పేరైనను శేషమైనను లేకుండ మిగిలిన నిప్పురవ్వను
ఆర్పివేయబోవుచున్నారని రాజుతో చెప్పగా 8 రాజు - నీవు నీ యింటికి పొమ్ము, నిన్ను గురించి ఆజ్ఞ ఇత్తునని
ఆమెతో చెప్పెను. 9 అందుకు తెకోవ ఊరి స్త్రీ - నా యేలినవాడా రాజా, దోషము నామీదను నా తండ్రి
ఇంటివారి మీదను నిలుచునుగాక, రాజునకును రాజు సింహాసనమునకును దోషము తగులకుండునుగాక అని
రాజుతో అనగా 10 రాజు - ఎవడైనను దీనిని గూర్చి నిన్నేమైన అనినయెడల వానిని నా యొద్దకు తోడుకొని
రమ్ము; వాడికను నిన్ను ముట్టకయుండునని ఆమెతో చెప్పెను. 11 అప్పుడు ఆమె - రాజవైన నీవు నీ దేవుడైన
యెహోవాను స్మరించి హత్యకు ప్రతిహత్య చేయువారు నా కుమారుని నశింపజేయకుండ ఇకను నాశనము చేయుట
మాన్పించుమని మనవి చేయగా రాజు - యెహోవా జీవము తోడు నీ కుమారుని తలవెంట్రుకలలో ఒకటైనను నేల
రాలకుండుననెను. 12 అప్పుడు ఆ స్త్రీ - నా యేలినవాడవగు నీతో ఇంకొక మాట చెప్పుకొనుట నీ దాసినగు నాకు
దయచేసి సెలవిమ్మని మనవి చేయగా రాజు- చెప్పుమనెను. 13 అందుకు ఆ స్త్రీ - దేవుని జనులైనవారికి
విరోధముగా నీవెందుకు దీనిని తలపెట్టియున్నావు? రాజు ఆ మాట సెలవిచ్చుటచేత తాను వెళ్లగొట్టిన తనవాని
రానియ్యక తానే దోషియగుచున్నాడు. 14 మనమందరమును చనిపోదుము గదా, నేలను ఒలికినమీదట మరల
ఎత్తలేని నీటివలె ఉన్నాము; దేవుడు ప్రాణము తీయక తోలివేయబడినవాడు తనకు దూరస్థుడు కాకయుండుటకు
సాధనములు కల్పించుచున్నాడు. 15 జనులు భయపెట్టిరి గనుక నేను దీనిని గూర్చి నా యేలినవాడవగు నీతో
మాటలాడ వచ్చితిని. కాబట్టి నీ దాసురాలనగు నేను - రాజు తన దాసినగు నా మనవి చొప్పున చేయు నేమో 16
రాజు నా మనవి అంగీకరించి దేవుని స్వాస్థ్యము అనుభవింపకుండ నన్నును నా కుమారునిని నాశనము చేయదలచిన
వానిచేతిలో నుండి తన దాసినగు నన్ను విడిపించునేమో అనుకొంటిని. 17 మరియు నీ దేవుడైన యెహోవా నీకు
తోడైయున్నాడు గనుక నా యేలినవాడవును రాజవునగు నీవు దేవుని దూతవంటివాడవై మంచి చెడ్డలన్నియు
విచారింప చాలియున్నావు; కాబట్టి నీ దాసివగు నేను నా యేలినవాడగు రాజు సెలవిచ్చిన మాట

సమాధానకరమగునని  అనుకొంటిననెను. 18 రాజు – నేను నిన్ను అడుగు సంగతి నీ వెంటమాత్రమును మరుగు
చేయవద్దని ఆ స్త్రీతో అనగా ఆమె – నా యేలినవాడవగు నీవు సెలవిమ్మనెను. 19 అంతట రాజు – యోవాబు
నీకు బోధించెనా అని ఆమె నడిగినందుకు ఆమె యిట్లనెను– నా యేలినవాడవైన రాజా, నీ ప్రాణముతోడు,
చెప్పినదానిని తప్పక గ్రహించుటకు నా యేలినవాడవును రాజవునగు నీవంటివాడొకడును లేడు; నీ సేవకుడగు
యోవాబు నాకు బోధించి యీ  మాటలన్నిటిని నీ దాసినగు నాకు నేర్పెను 20 సంగతిని రాజుతో మరుగు
మాటలతో మనవి చేయుటకు నీ సేవకుడగు యోవాబు ఏర్పాటు చేసెను. ఈ లోకమందు సమస్తమును
ఎరుగుటయందు నా యేలినవాడవగు నీవు దేవదూతల  జ్ఞానమువంటి జ్ఞానము గలవాడవు. 21 అప్పుడు రాజు
యోవాబుతో ఈలాగున సెలవిచ్చెను. ఆలకించుము, నీవు మనవి చేసినదానిని  నేను ఒప్పుకొనుచున్నాను. 22
తరువాత – యౌవనుడగు అబ్షాలోమును రప్పింపుమని అతడు సెలవియ్యగా యోవాబు సాష్టాంగ నమస్కారము
చేసి రాజును స్తుతించి– రాజవగు నీవు నీ దాసుడనైన నా మనవి అంగీకరించినందున నా యేలినవాడవగు
నీవలన నేను అనుగ్రహము నొందితిని నాకు తెలిసెనని చెప్పి లేచి గెషూరునకు పోయి 23 అబ్షాలోమును
యెరూషలేమునకు తోడుకొని వచ్చెను. 24 అయితే రాజు  – అతడు నా దర్శనము చేయక తన ఇంటికి పోవలెనని
ఉత్తరవు చేయగా అబ్షాలోము రాజదర్శనము చేయక తన ఇంటికి పోయెను. 25 ఇశ్రాయేలీయులందరిలో
అబ్షాలోమంత సౌందర్యము గలవాడు ఒకడును లేడు; అరికాలు మొదలుకొని తలవరకు ఏ లోపమును అతనియందు
లేకపోయెను. 26 తన తల  వెండ్రుకలు భారముగా నున్నందున ఏటేట అతడు వాటిని కత్తిరించుచు వచ్చెను;
కత్తిరించునప్పుడెల్ల వాటి యెత్తు రాజుతూనికను బట్టి రెండువందల తులములాయెను. 27  అబ్షాలోమునకు
ముగ్గురు కుమారులును తామారు అను నొక కుమార్తెయు పుట్టిరి; ఆమె బహు సౌందర్యవతి. 28 అబ్షాలోము
రెండు నిండు సంవత్సరములు యెరూషలేములో  నుండియు రాజదర్శనము చేయక యుండగా29 యోవాబును
రాజునొద్దకు పంపించుటకై అబ్షాలోము అతనిని  పిలువ నంపినప్పుడు యోవాబు రానొల్లక యుండెను. రెండవమారు
అతని పిలువనంపినప్పుడు అతడు రానొల్లకపోగా 30 అబ్షాలోము తన పనివారిని పిలిచి – యోవాబు  పొలము
నా పొలము దగ్గర నున్నది గదా, దానిలో యవల చేలు ఉన్నవి; మీరు పోయి వాటిని తగులబెట్టుడని వారితో
చెప్పెను. అబ్షాలోము పనివారు ఆ చేలు తగులబెట్టగా  31 యోవాబు చూచి లేచి అబ్షాలోము ఇంటికి వచ్చి – నీ
పనివారు నా చేలు తగులబెట్టిరేమని అడుగగా 32 అబ్షాలోము యోవాబుతో ఇట్లనెను – గెషూరు నుండి నేను
వచ్చిన ఫలమేమి? నేనచ్చటనే యుండుట మేలని నీ ద్వారా రాజుతో చెప్పుకొనుటకై రాజు నొద్దకునిన్ను పంపవలెనని
నేను నిన్ను పిలిచితిని; రాజదర్శనము నేను చేయవలెను; నాయందు దోషము కనబడినయెడల రాజు నాకు
మరణశిక్ష విధింపవచ్చును. 33 అంతట యోవాబు  రాజునొద్దకు వచ్చి ఆ సమాచారము తెలుపగా, రాజు
అబ్షాలోమును పిలువనంపించెను. అతడు రాజునొద్దకు వచ్చి రాజసన్నిధిని సాష్టాంగ నమస్కారము చేయగా రాజు
అబ్షాలోమును ముద్దుకొనెను.